
# బుద్బుదం

ఎం. ఉదయభాను



"నది నిండా నీళ్లు ఉన్నా,
మనకెంత ప్రాప్త మన్నా,
కడవైతే కడివెడు నీళ్ళే
గరిటైతే గరిటెడు నీళ్ళే..."
స్పీకర్‌లో నుండి వస్తున్న పాటను వింటూనే సిస్టర్ నిర్మల డ్రైవర్ యాదగిరిని మందలించింది.

''ముందా పాట ఆపు... అసలే ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఈ పేషంట్లు ఆ పాట వింటే ఎంతగా అప్‌సెట్ అవుతారో తెలుసా...?''

''మీరెందుకలా ఆలోచిస్తున్నారమ్మా... ఈపాట గాని వాళ్ల చెవిన పడితే వాళ్ళకు కూడా ఎంతో కొంత వేదాంత ధోరణి వాళ్ళ మనసుల్లో మెదులుతుంది.

''అబ్బ.... నీతో వాదించే కండీషన్లో నేను లేను. పోనీ సౌండైనా తగ్గించు. ఈ పేషంట్లని త్వరగా ఆపరేషన్ థియేటర్‌లో చేర్చాలి. లేకుంటే ఇక్కడే వాళ్ళ ప్రాణాలుపోయేలాగున్నాయి. కొంచెం స్పీడుగా పోనీ...'' అంటూ తొందర చేసింది నిర్మల.

అంబులెన్స్ పీ...పీ...సైరన్ మోగిస్తూ ఆసుపత్రి ఆవరణలో ఆగింది.

క్షణం ఆలస్యం చేయకుండా అంబులెన్స్‌లో ఉన్న ఇద్దరినీ ఎమర్జెన్సీ వార్డ్‌లో చేర్చారు.

డాక్టర్ గౌతమ్ ఇద్దరికీ అత్యవసరంగా చికిత్స ప్రారంభించాడు.

ఇద్దరు పేషంట్లలో ఒకరు ప్రశాంత్, మరొకరు ప్రవీణ్. రోడ్డు మీద జరిగిన యాక్సిడెంట్ కారణంగా ఇద్దరి తలలకు బలమైన గాయాలయి రక్తం బాగా పోయింది.

ఓ అరగంటకు ఇద్దరి బంధువులు అక్కడకు చేరుకున్నారు. వాళ్ళ ఏడుపులతో ఆ ప్రాంతమంతా గగ్గోలుగా మారింది.

ఎమర్జెన్సీ వార్డులో డాక్టర్ చేయవలసిన ప్రయత్నలన్నీ చేసి, ఇంక దేవుడిదే భారం అన్నాడు.

ఇద్దరూ మరణశయ్యపై ఉన్నారు.

ఇద్దరినీ ఒకే రూమ్‌లోకి చేర్చారు.

ప్రతీ మనిషికి ఏదో ఒక రోజు ఇలాంటి పరిస్థితి తప్పదు. ఈ దశలో తను జీవితానుభవాలు నెమరేసుకోవడం సహజం.

అతని జీవితం తృప్తిగా సాగితే సంతోషంతో అతని ఆయువు పెరిగే అవకాశం ఉంది. నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడితే రేపటి సూర్యోదయాన్ని చూడలేడు. బ్రతికుంటే ఈ కొన్ని గంటలు తమ జీవితానుభవాల్ని ఒకరినొకరు పంచుకోనివ్వండి...'' అని చెప్పాడు డాక్టర్ గౌతమ్.

డాక్టర్ మాటలు ఇద్దరి చెవిన పడ్డాయి.

***

మరణశయ్యపై ఉండి మృత్యువుకై ఎదురు చూడడం నిజంగా నరకప్రాయమే.

గదిలో శ్మశాన నిశ్శబ్దం ఆవరించి ఉంది. ఏ.సి. ప్లాంట్ చల్లగాలి వీస్తోంది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ప్రశాంత్ మాటలు వినిపించాయి.

''ఫ్రెండ్ నిజంగా విధి చాలా విచిత్రమయింది. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ స్నేహితుణ్ణి చూడ్డానికి బయలుదేరిన మనిద్దరం ఇలా ప్రమాదస్థితిలో చిక్కుకున్నాం.

అన్నట్టు ముందుగా నీకు నేను సారీ చెప్పాలి. నువ్వు రానన్నా అనవసరంగా నిన్ను కదిలించాను. అందుకే ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా. నా ఆయువు నీకు పోసి నన్ను తీసుకెళ్ళమని...'' అంటున్న ప్రశాంత్ మాటలు వింటూనే అంత బాధలోనూ ప్రవీణ్ కోపంగా...

''అందుకే నువ్వంటే మంట నాకు. ఆ శంకర్ గాడెవ్వడు? నీకు గానీ, నాకు గానీ చుట్టమా...? ఇప్పుడు చూడు అనవసరంగా ప్రాణం మీదకు తెచ్చుకొన్నాం...'' అంటూ కస్సుమన్నాడు.

''నిజమే మిత్రమా... నీకులా నేను ఆలోచించలేదు. ఆ శంకర్ మనిద్దరికీ బంధువుకాదు కానీ అతను మనతోటి మనిషి. అంతే నాకు తెలిసింది.

జరిగిందేదో జరిగిపోయింది. జరిగిందే తలచుకుంటూ కూర్చుంటే మనశ్శాంతి ఉండదు. అనవసర కాలయాపన ఎందుకు చెప్పు...? కాలం గుప్పిట్లో ఇసుకలాంటిది. మనం బ్రతికి ఉండే ఈ కొద్ది సమయంలో మనకు సంతోషాన్ని కలిగించిన సంఘటనలు తలుచుకొందాం.

డాక్టర్ చెప్పింది విన్నావుగా. ఎందుకైనా మంచిది. నువ్వే ముందు ప్రారంభించు... తరువాత ఏదైనా జరిగిందంటే మళ్ళీ బాధపడతావు...'' అన్నాడు ప్రశాంత్.

''నీకు పేరు ఎందుకు పెట్టారో గాని ఇలాంటి పరిస్థితి కూడా నువ్వింత ప్రశాంతంగా, కూల్‌గా ఎలా ఉండగలుగుతున్నావో... నాకైతే బిగ్గరగా ఏడవాలని ఉంది...''

''మనం చేయగలిగిందేమీ లేనప్పుడు కేవలం ఏడ్చినంత మాత్రాన ఒరిగేదేమి లేదు కదా... ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్...''

''ఎక్కడి నుండి ప్రారంభించను...?''

''నీ ఇష్టం... నీకు తృప్తిని, హాయిని కలిగించిన ఏ అంశాన్నైనా ప్రస్తావించు. ఇక్కడ దాపరికాలేం లేవు. మనిద్దరమే ఉన్నాం. మూడో వ్యక్తి ఎవ్వరూ మన మధ్య లేరు గుర్తుంచుకో...

***

ప్రవీణ్ గొంతు సవరించుకొని ప్రారంభించాడు.

''చిన్నప్పటి నుండి నాకు డబ్బులంటే ఇష్టం. నాన్న దగ్గర డబ్బులు తీసుకొని చాక్‌లెట్లు, ఐస్‌క్రీమ్‌లు కొనుక్కుని తినేవాణ్ణి.

నేను ఐస్‌క్రీమ్ తినడంకంటే నా పక్కనున్న వాడికి చూపిస్తూ, వాణ్ణి ఊరిపిస్తే నాకు మహదానందంగా ఉండేది.

కొంచెం పెద్దయ్యాక మన డబ్బు ఖర్చు చేసి తినడం కంటే పక్కవాడి జేబులోని డబ్బు ఖర్చు చేయించడంలో ఆనందం ఉందని తెలిసింది. ఆ ప్రకారం పక్క వాళ్ళను కాకా పట్టడంలో నిష్ణాతుణ్ణయ్యాను.

కాలేజీలో అమ్మాయిలకు కూడా నా సంగతి తెలిసి నాతో ఎవ్వరూ స్నేహం చేసేవారు కారు. నాకూ పెద్ద బాధగా ఉండేది కాదు. సినిమాలో, షికార్ల వల్ల పెద్దగా సంతోషం కలిగేది కాదు. నాకు డబ్బులు దాచటంలో మహదానందంగా ఉండేది.

ఉద్యోగంలో చేరిన తరువాత ఆఫీసు పనికన్నా నా పై బాసును మెప్పించడానికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవాడిని. పని ఉన్నా లేకున్నా నాపై అధికారుల ధ్యాస నాపై పడేందుకు ఆఫీసులో అందరికంటే ముందుగా వచ్చి అందరికంటే ఆఖరుగా ఇంటికి వెళ్ళేవాడిని.

నా బాసుకు నా సహ ఉద్యోగుల గురించి ఒకటికి నాలుగు మాటలు జత చేసి చెడుగా చెప్పేవాడిని. బాసు వాళ్ళను చెడామెడా తిడుతుంటే సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయ్యే వాణ్ణి.

కొద్దిపాటి ఖర్చుతో సుఖాన్ని కొనుక్కోవడమే శ్రేయస్కరంగా భావించేవాణ్ణి. అందుకు నా పెళ్ళి విషయంలో కూడా నేను తొందర పడలేదు. పెళ్ళాం వస్తే అదోఖర్చు. అందుకే పెళ్ళి బాగా ఆలస్యంగా చేసుకున్నాను. అమ్మాయి పేరు ధనలక్ష్మి.

నాకన్నా ఎక్కువ సంపాదించే అమ్మాయినే చేసుకున్నాను. పెళ్ళయిన కొత్తలో ధనలక్ష్మి సినిమాలు, షికార్లు అంటూ పోరు పెట్టేది మొదట్లోనే ఇలాంటి జులాయి తిరుగుళ్ళు నాకు నచ్చవని తేల్చి చెప్పేసా.

ఉద్యోగం చేసేది రైల్వే డిపార్ట్‌మెంట్‌లోనే అయినా టూర్లపట్ల ఆసక్తి ఉండేది కాదు. మరీ తప్పనిసరి పరిస్థితి అయితే నాకు ఫైల్స్ జబ్బు ఉందని తప్పించుకొని తిరిగేవాణ్ణి.

ప్రతీనెలా మొదటి తారీకు రాగానే బ్యాంకుకు వెళ్ళి బ్యాంక్ బాలెన్స్ చెక్ చేసుకొనే వాణ్ణి. నాది, నా భార్య జీతం అందులో కలిసేది. పెరిగిన బ్యాలెన్స్ చూసుకొంటే చెప్పలేని సంతోషం వేసేది.

ఎవరికన్నా డబ్బు అవసరం ఉందంటే డబ్బు వడ్డీలకు ఇచ్చేవాణ్ణి. అసలు కన్నా వడ్డీ ముద్దు అన్నమాటలోని యదార్థం గ్రహించాను. వడ్డీ తీసుకున్నప్పుడు నాకెంత సంతోషం వేసేదో మాటల్లో చెప్పలేను.


ధనలక్ష్మి కూడా డబ్బును అమితంగా ప్రేమించేది. ఇద్దరం కూడా ప్రమోషన్ వచ్చే వరకు పిల్లల్ని కనకూడదనుకున్నాం.

ఒక్క క్షణం వృధా చేయకుండా కాలాన్ని డబ్బుతో కొలిచే వాళ్ళం. నాకు నలభై ఏళ్ళు వచ్చే సరికి నా భార్య నడివయస్సులోకి వచ్చేసింది. ఈ వయసులో పిల్లలు పుట్టడం కష్టమన్నారు.

అప్పుడనిపించింది డబ్బుయావలో పడి జీవితం వృథా చేసుకున్నామని. మా ఇద్దరికీ ప్రమోషన్ వచ్చింది. ఇద్దరం ఆఫీసర్లమయ్యాం. ఓ పాపని దత్తతకు తెచ్చుకొని పెంచుకోసాగాం.

పాప ఆలనా పాలనా చూడడానికి మాకు టైమ్ ఉండేదికాదు. ఓ ఆయాను ఏర్పాటు చేసాం. పాపా ఆయానే 'అమ్మ' అని పిలిచేది.

పోనీ ఉద్యోగం మానడానికి లేదు. చూస్తూ...



చూస్తూ పాతిక వేలు జీతం వదులుకోడానికి మనసొప్పేదికాదు.

మేమిద్దరం కలిసి సరదాగా టూర్లకెళ్ళిన సందర్భాలేవీ లేవు. రోజూ రాత్రి పదిగంటల వరకు ఆఫీసులోనే ఉండేవాడిని. నీకు ఇది వరకే చెప్పాను. తోటి ఉద్యోగస్తుల మీద చాడీలు చెప్తుంటే నాకు అమితానందం వేసేది.

'పిల్లా పీసు లేని వాడివి మా బాధ నీకేం తెలుస్తుందని...'' వాళ్ళు చాటుగా నన్నుతిట్టుకున్నా నా నైజం మారేది కాదు.

ఇప్పుడు నా బ్యాంకు బాలెన్స్ కోటి రూపాయలకు పైగా దాటింది. ఆ డబ్బంతా ఎవరిసొత్తవుతుందోనని భయమేస్తుంది. అనవసరంగా డబ్బు కోసం జీవితం వృధా చేసుకున్నానేమో అనిపిస్తోంది...'' అంటూ చెప్పడం పూర్తి చేసాడు ప్రవీణ్.

ప్రవీణ్ చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు ప్రశాంత్. ఇక తనవంతు చెప్పడం ప్రారంభించాడు ప్రశాంత్.

***

నాకు చిన్నప్పటి నుండి పుస్తకాలంటే ప్రాణం. చిన్నప్పుడు 'చందమామ' చదువుతుంటే చందమామ చేతికి అందినంత సంతోషం వేసేది. చందమామ అప్పట్లో పద్నాలుగు భాషల్లో వచ్చినా ముందుగా తెలుగులోనే వచ్చేది. ఆ విషయం తలచుకొంటే నాకెంతో గర్వంగానూ, సంతోషంగానూ ఉండేది.

'టామ్‌సాయర్', 'హకల్ బెరీఫిన్' పుస్తకం చదువుతుంటే నన్ను నేను మరచిపోయేవాణ్ణి. ఆ నవల చివరి చాప్టర్‌లు వచ్చే సరికి అప్పుడే పుస్తకం అయిపోతుందా అన్న దిగులు ఆవహించేది నాకు.

నాకు నచ్చిన పుస్తకాలు నలుగురితో చదివించి నా సంతోషాన్ని పంచుకునే వాణ్ణి. చిల్డ్రన్స్ లైబరీలోని పుస్తకాలు చూస్తుంటే నా కడుపు నిండిపోయేది.

ఓ రోజు స్కూల్ గ్రౌండ్‌లో ఓ చిన్న పాప ఫిట్స్ వచ్చి పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేరు. ఆ క్షణాన ఎలాగైనా ఆ పాపను కాపాడలనిపించింది. వెంటనే స్కూల్ బెల్ మ్రోగించాను. మరుక్షణాన హెడ్‌మాస్టర్‌తో సహా అందరూ నా చుట్టూ మూగారు. పాపను వెంటనే ఆసుపత్రి పంపించి సకాలంలో వైద్యం చేయడం వల్ల పాప ప్రాణాపాయస్థితి నుండి బయటపడింది.

మరునాడు ఆ పాప తల్లితండ్రులు చూపించిన కృతజ్ఞతకు మనసంతా ఆనందంతో నిండిపోయింది.

అప్పుడే తెలిసింది పొరుగు వాడికి చేసే సాయం వల్ల మనకెంత ఆత్మసంతృప్తి కలుగుతుందోనని.

కాలేజీ స్థాయిలో అన్నిరకాల సాహిత్యాన్ని చదివాను. గురువులెవ్వరూ చెప్పని పాఠాలే జీవితపాఠాలు అవే గుణపాఠాలు.

గాంధీజీ నిరాడంబర జీవనశైలి, బుద్ధుడి అహింసా విధానం, భగవద్గీతలోని కర్మ సిద్ధాంతం బాగా వంట బట్టింది. వేదాంతాన్ని వృద్ధ నారీ పాతివ్రతం లాగా జీవితం చరమాంకంలో నెమరువేసుకోవడానికి కాదు. జ్ఞానసముపార్జనలో భాగంగా యవ్వనదశలోనే అర్థం చేసుకోవడం మంచిది.

మా తల్లితండ్రులు చూసిన సంబంధం నీరజను చేసుకున్నాను. నీరజకు చక్కని సంగీతం అభిరుచి ఉంది. ఇంట్లోనే ఉండి పిల్లలకు సంగీత పాఠాలు నేర్పేది. నీరజను చేసుకోవడం నిజంగా నా అదృష్టంగా భావించా.

ఆఫీసు పని అవ్వగానే ఇద్దరం సాయంకాలం రవీంద్రభారతికో, త్యాగరాయగాన సభకో వెళ్ళేవాళ్ళం. మంచి సినిమా ఏదైనా ఉందంటే తప్పని సరిగా చూసి ఎంజాయ్ చేసే వాళ్ళం.

ఇక వృత్తి, ప్రవృత్తి ఒక్కటిగా ఉండడం అరుదైన విషయం. ఆ అరుదైన అవకాశం నాకు లభించింది. రైల్వేశాఖలో టూర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం రావడం నా అదృష్టంగా భావించాను.

సంవత్సరానికోసారి నీరజతో కలిసి విధిగా భారతదేశంలోని ప్రముఖ యాత్రస్థలాలన్నీ చూసాం.

ముఖ్యంగా బేలూర్, హంపి, అజంతా, ఎల్లోరా లాంటి ప్రదేశాలను చూస్తుంటే మమ్మల్ని మేము మరచిపోయేవాళ్ళం.

ఉద్యోగరీత్యా కూడా ఆసేతు హిమచలం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు డజనుసార్లకు పైగా తిరిగాను. ఆ అనుభూతుల్ని నా గుండెలనిండా నింపుకున్న సంపద.

పుస్తకాల్ని పోగేయడం నాకెంతో ఇష్టమయిన ప్రక్రియ. మా ఇంటికెవరైనా వస్తే అన్నిరకాల సాహిత్యాన్ని ఆస్వాదించవచ్చు.

ఇక నా పిల్లలు స్నిగ్ధ, అభినయ్‌లకు ఎమ్.సెట్ చదవమని సాధించలేదు. వాళ్ళకిష్టమయిన కళారంగాల్లోనే ప్రోత్సహించా. స్నిగ్ధ సంగీతంలో నిష్ణాతురాలైంది. అబ్బాయి అభినయ్ మంచి చిత్రకారుడుగా స్థిరపడ్డాడు.

మా జీవన సరళి కూడా ఎంతో సామాన్యంగా ఉండేది. ఎప్పుడూ అనవసర ఆడంబరాలకు, దర్పాలకుపోలేదు.

ఆఫీసులో నాతోటి ఉద్యోగస్తులతో ఏనాడూ పరుషంగా మాట్లాడలేదు. ఆ సంగతి నీక్కూడా తెలుసు. నేనేదయినా బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్తుంటే. అక్కడి స్టాఫంతా

''అయ్యో సార్ వెళ్ళి పోతున్నారా...'' అని బాధపడ్డ వారే కాని ఎవ్వరూ కూడా ''వీడు పోయాడా పీడా విరగడైంది...'' అనుకున్న వాళ్ళులేరు.

ఈ జీవితానికి ఈ సంతృప్తిచాలు.

జీవితం అంటే కేవలం ధన సంపాదనే కాదు. ధనం కూడేయడం అంతకన్న కాదు. డబ్బుతోనే సుఖం ఉందనుకోవడం ఎండమావిలో నీటికోసం పరుగుతీయడంలాంటిదే.

చావు, పుట్టుకలు మన చేతిలోలేవు.

అన్నట్టు ఓ విషయం చెప్పడం మరిచాను నీకూలాగే నాకు కూడా వడ్డీ అంటే ఎంతో ముద్దు...''

ప్రవీణ్ ఆ మాట వింటూనే ఉలిక్కిపడ్డాడు.

''నీక్కూడా వడ్డీ అంటే ఇష్టమా...'' ఆశ్చర్యంగా అడిగాడు.

చిన్నగా నవ్వాడు ప్రశాంత్.

''నీకులాగే నాక్కూడా చివరికోరిక ఒకటి మిగిలిపోయింది ఒక్కసారి నా సిరి, సంపదల్ని చూసి కన్ను మూయాలని ఉంది...జాతస్యో మరణం ధృవం... ఈ జీవితానికింతే ప్రాప్తం అనుకుంటా.

ఈ గుండెనిండా ఎన్నో అందమైన అనుభూతులు, అనుభవాలు. అవి నెమరేసుకుంటే ఈ జీవితానికి ఇవి చాలు అనిపిస్తుంది. ఈ ఆత్మసంతృప్తి నాకెంతో సంతోషాన్ని కలిగిస్తుంది. వింటున్నావా...?'' అడిగాడు ప్రశాంత్.

సన్నగా ప్రవీణ్ ఏడుపు వినిపిస్తోంది. ప్రశాంత్ 'ఛ...ఊరకో...' అని సమాధాన పరుద్దాం అనుకున్నాడు కాని ఏదో తెలియని అశక్తతో కళ్ళకు మగతకమ్మగా దీర్ఘంగా నిట్టూరుస్తూ కళ్ళు మూసుకున్నాడు ప్రశాంత్.

***

ఉదయం ఎమర్జెన్సీ వార్డు బయట ఇద్దరి కుటుంబాల వాళ్ళు డాక్టర్ ఏం చెబుతాడా అని ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

''డాక్టర్ గౌతమ్ పదినిమిషాల తరువాత బయటికి వచ్చి'' అంతిమ ఘడియల్లో మనిషికి మందుల కన్నా వైద్యసేవల కన్నా అతని ఆత్మబలమే మనిషి జీవేచ్ఛను పొడిగిస్తుంది.

ఆత్మసంతృప్తి కొరవడిన ప్రవీణ్‌లాంటి వాళ్ళకు ఏ మందులు, మాకులు పనిచేయవు. ప్రశాంత్ ఆత్మబలమే అతని ఆయువు పెంచింది...'' అతని మాటలు ఇంకా పూర్తి కానేలేదు

అక్కడున్న కొందరి కంట్లో పన్నీరు చిందితే మరి కొందరి కంట్లో కన్నీరు వాగై ప్రవహించింది.

కళ్ళు తెరచిన ప్రశాంత్‌కు మనవరాళ్ళిద్దరు సిరి, సంపదలు తమ చిట్టిచేతుల్లో తన కన్నీటిని తుడుస్తూ కనిపించారు.

సిరి, సంపదలను చూడాలనుకున్న తనకోరిక ఈడేర్చినందుకు అఖిలాండ నాయకునికి రెండు చేతులెత్తి ప్రణమిల్లాడు ప్రశాంత్ ప్రశాంతంగా.

తను కోరుకున్న సిరి, సంపదలను మిత్రుడు ప్రవీణ్‌కు చూపించాలనుకుని తల తిప్పిచూసాడు కాని అప్పటికే ప్రవీణ్ బంధుగణం దుఃఖంలో మునిగి ఉండటం కనిపించింది.

గద్గద స్వరంతో...

''జీవితం బుద్బుధం...సెలవు మిత్రమా...'' అనుకోకుండా ఉండలేకపోయాడు ప్రశాంత్.

✻

